# 'నీ కాలు మొక్కుతా! నీ బాన్చని!'

ఆ రోజుల్లో రంగారావు ఆరితేరిన రాజకీయవేత్త. నాబోటి నిస్తేజ ప్రాణులకు సహితం ప్రాణం పోసేటట్టు మాట్లాడేవాడు. ఆరోజుల్లో అతను వేదిక మీదికి ఎక్కి "మన పట్టాభిగారు, మన ప్రకాశంగారు, మన కళాగారు, మన నడింపల్లి నరసింహారావుగారు" అనిదంచి మాట్లాడేస్తుంటే నాకు అసూయగా వుండేది. అవన్నీ కోతలుకావు కూడాను. కాంగ్రెసు జిల్లా, రాష్ట్ర ఎన్నికల సందర్భంలో రంగారావు పెత్తనంకూడా వుంటూవుండేది. అతనికి అన్ని విషయాలూ ముందుగా తెలుస్తూ వుండేవి.

ఉప్పు సత్యాగ్రహంలో జైలుకువెళ్ళి బయటికొచ్చాడు రంగారావు. నేను ఉదరనిమిత్తం నైజాము రాజ్యం వెళ్లుతూంటే నావెంట రంగారావు కూడా

వచ్చాడు. అక్కడ అతని బంధువొకాయన హనుమకొండలు వైద్యుడుగా వుంటుండేవాడు. ఆ ప్రాంతం చూడటం మాకిద్దరికీ అదే కొత్త.

"ఏమిటోయ్, వీళ్ళంతా ఇంత బైతుముండా కొడుకులేం?" అన్నాడు రంగావు. అక్కడ తెల్లగుడ్డ వేసుకున్నవాడు దేశముఖుతో సమానం. ఇంగ్లీషు మాట్లాదేవాడు దొరతో సమానం. అక్కడి సుబేదారుతో తప్ప మిగిలినవారందరితోటి మాకు పరిచయం అయింది. అన్వర్‌సాబూ, దువ్వ సాబూ, సెషన్సు జడ్జీ, అమీన్ సాబూ ఇంకా ఎవరెవరో మాకు షేక్ హాండు ఇచ్చి స్వర్గంనుంచి వచ్చట్టు చూశారు. మా ఇంగ్లీషు బాగుంటుందనీ, తమ ఇంగ్లీషు బాగుండదనీ అన్నారు. ఈ బొల్లి కబుర్లు నేను నమ్మలేదుగాని రంగారావు నమ్మేశాడు. ముఖ్యంగా జిల్లా సూపర్నెంటు దొరతో బాగా ఇంగ్లీషు మాట్లాడుతాడు. ఆ విషయం కూడా రంగారావు గమనించలేదు.

వీళ్ళంతా మమ్మల్ని గొప్పగా చూడటమూ, మామూలు మనుష్యులు మాతో మాట్లాడేటప్పుడు, నీ కాల్మొక్కుతా! నీ బాన్చని!" అని అడుగడుగునా ప్రాదేయపడటంచూసి రంగారావు తానేదో బ్రహ్మాండ నాయకుణ్ణనుకున్నాడు. పది రోజులుండి రంగారావు తనదారిన తను వెళ్ళాడు. నాలుగు నెల్లు అక్కడ వుండిపోయినవాణ్ణి నేనూ. నాకు తెలుసును! రంగారావు వెంట నిజాం పోలీసొకడు ప్రతిరోజూ తిరిగాడని, ఆ పోలీసుకూ నాకు స్నేహమయింది. రంగారావు వెంట తిరిగిన సంగతి నాతో వాడే చెప్పాడు. రంగారావు నేను బస్సు దిగిన గంటకల్లా అతను కాంగ్రెసువాడని పోలీసు వాసన పట్టేశాడు.

రంగారావు అక్కడ వుండగానే మరొక విషయం జరిగింది. ఒకనాడొక కుర్రవాడు వచ్చి రహస్యంగా ఫలానిచోట చిన్న మీటింగు జరుగుచున్నది రమ్మని మాకిద్దరికీ ఆహ్వానం అందించినాడు. ఏం మీటింగంటే మామూలు మీటింగేనన్నాడు. మీటింగుకు వెళ్ళాం. అంతా పది పన్నెండు మంది వచ్చారు. అది కాంగ్రెసు మీటింగు. ఆ సంగతి తెలియగానే రంగారావు నిరుత్సాహపడ్డాడు.

"కాంగ్రెసు మీటింగు ఇట్లా చేస్తారా? ఈ రహస్యమేమిటి? ఈ పదిమంది మధ్యా ఈ తీర్మానాలేమిటి? ఇవి ఎవరికందుతై? ఎవరు వీటిని అమలు జరుపుతారు? మేం మీటింగు చేస్తే వేలకు వేలు చేరుతారే?" అంటూ రంగారావు తన సహజ ధోరణిలో వాళ్ళకి వేడి ఎక్కించాడు. వాడి మాటలంతా ఆత్రంగా విన్నారు.

"ఈడ మీటింగంటె మంది వచ్చేదిలేదు. ఎవురికీ బయమే కాంగిరెసని ఏనాడైతె పెట్టినామో నాటినుంచి ఇట్టనె దాలా అయితుందది" అని అక్కడివాళ్లు మాకు తెలియజేశారు.

ఇంటికి వస్తూ రంగారావు నాతో "ఎబ్బే! వీళ్ళ మొఖం! వీళ్ళకి రాజకీయ చైతన్యం ఎక్కించటానికి కనీసం ఒక శతాబ్దం పడుతుంది. స్వాతంత్ర్యమంటే ఏమిటో తెలియాలంటే అధమం రెండు శతాబ్దాలు పడుతుంది! మనమేదన్నా వీళ్ళకి సాధించి పెడితేకద్దు, లేకపోతే లేదు. ఎబ్బే వొట్టి గొడ్డుముండా కొడుకులు!" అన్నాడు.

రంగారావు వెళ్ళిపోయినాక నేను అతని చుట్టమైన డాక్టరుగారి స్నేహం గాని, మిగిలిన గొప్పవాళ్ళ స్నేహంగాని ఆశించలేదు. నాకు స్నేహమైన వారంతా అక్కడ చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకునేవాళ్ళు. అందులో కొందరు సాయిబులు కూడా వుండేవారు. ఒక సాయిబు నాకు ఉర్దూ అక్షరాలు రాయటమూ చదవటమూ కూడా నేర్పాడు.

ఆ సాయిబు స్నేహితుణ్ణి చూస్తే నాకు చాలా సంతోషంగా వుండేది. అతని ప్రవర్తన అతి నిర్దుష్టంగానూ అతి వినయంతో కూడుకుని వుండేది. ఇంత వక్కపలుకు యిచ్చినా రెండు చేతులతోటీ అందుకుని లేచి నిలబడి, దాన్ని కళ్ళకు మూడుసార్లు అద్దుకుని "షుక్రియా" అని మళ్ళా కూర్చునేవాడు. బీడీకి నిప్పు అందించినా ఇదే వరస. అతని విషయంలో ఒక చిక్కుగా వుండేది. ఈ వినయం నేనెక్కడ నటించగలను? నన్ను అతను మొరటు మనిషి కింద చూస్తాడేమోనని.

మాకు ఇటువంటి అలవాట్లు లేవు. నన్ను అపార్థం చేసుకోవద్దని అతనితో అందామని ఎన్నోసార్లు నోటిదాకా వచ్చింది. కాని తీరా అనబుద్ధి అయేదికాదు. ఎందుకంటే నా అంతరాత్మలో నిజంగా అతని ప్రవర్తనమీద నాకు గౌరవం లేదు. అతను జమిందారీ నాగరికతకు బానిస. ఆ సలాములూ, గుంజీలూ ఉంటేగాని అతని ఆత్మ గౌరవం నిలువదు. అతని ఆత్మ గౌరవమంతా దాని మీదనే ఆధారపడి ఉంది. మరి నేను చూసిన "బడాసాబు" లంతా ఇంతే. నూటికి పదిమందో. పన్నెండుమందో ఉన్న బడా సాయిబులు మిగతా వాళ్ళచే "నీ కాల్మొక్కుతా" అనిపిస్తున్నారంటే ఆ బానిసత్వం ఈ పది పన్నెండు మందికి సోకకుండా ఎట్లా ఉంటుంది?

అక్కడ నేనున్నది నాలుగు నెలలేకాని ఈ నాలుగు నెలలూ అయిపొయ్యే లోపుగా నేను స్వేచ్ఛ కోసం పరితపించసాగాను. బ్రిటిషువాళ్ళు మనని దాస్యంలో ఉంచారని పెద్దలు చెప్పగా వినటమేగాని ఆ దాస్యం స్వరూపమేమిటో అంత కన్న స్వేచ్ఛగా ఎట్లా ఉండవచ్చునో నాకెన్నడూ తెలియలేదు. నేను ఏ ఇంగ్లండో అమెరికానో పోయి అక్కడ జీవితం చూసి ఉంటే నా దాస్యస్థితి

అర్థం చేసుకుని ఉండేవాణ్నేమో. నిజాము రాజ్యం చూసినాక బ్రిటిషువాళ్ళ పరిపాలన లక్షరెట్లు మెరుగనిపించింది.

ఈ నిజాము రాష్ట్రం వాళ్ళకి ఏ హక్కులూ లేవు. పోలీసులకి విపరీతమైన అధికారాలు. ప్రతి పోలీసు వాడూ గూఢచారుడే. ప్రతి కూలివాడూ వెట్టివాడే. గ్రామాలున్నాయంటే దేశముఖు రాజు, లేకపోతే అమీన్‌సాబు నవాబు. వాళ్ళ తరవాత పటేళ్ళు సర్వాధికారులు. అధికారులు ప్రజలను బహిరంగంగా దోచుకోవడమే పరిపాలన. వరంగల్‌వంటి సుబాలో కూడా కచ్చేరీలలో ఉద్యోగస్తులు నవాబు దర్జా వెలిగిస్తారు. తాంబూలం వెయ్యటమూ, బీడీలు కాల్చటమూ, "థూన్‌దాన్"లో ఉమ్మటమూ వాళ్ళ పని. అడిగే నాధుడు లేడు. లంచాలు పట్టని అధికారి వింత మనిషి. అవ్వల్‌సాబ్ లంచాలు పట్టడని ప్రతీతి. అంటే పదివేలకు తక్కువ పట్టడట! నిజాములో కొందరు పెద్దలు నవాబుగారికి అర్జీ పెట్టుకుని సాయిబులతో సమంగానైనా హిందువులకు ప్రభుత్వోద్యోగాలిప్పించ వలసిందని అర్జీ పెట్టుకున్నారట. ఆ అర్జీ నేనక్కడ ఉన్న రోజుల్లోనే బుట్ట దాఖలయిందని విన్నాను.

ఈ విషయాలన్నీ చెవినిపడ్డయే గాని నాకు నిజంగా పట్టలేదు. నన్ను బాధించినదల్లా అక్కడ ఎవరి దగ్గరా మంచి పుస్తకాలు దొరకవు. ఎవరితోనూ పెద్ద విషయాలమీద చర్చించటానికి లేదు. అక్కడ నాకు కావలసిన సంస్కారము లేదు. మా ఊళ్ళో ఉద్యోగం లేకుండా తిరిగినా ఆ గాలి పీలిస్తేనే చాలు. సాయంకాలము రెండు మూడు గంటలు క్లబ్బుకో పార్కుకో పోతేనే చాలు. జీవితం ధన్యమవుతుందని పించింది. నిజాము రాజ్యం వొదిలివేసి వచ్చేశాను.

"నీకు ముల్కీ సర్టిఫికట్టు సంపాదిస్తాను. ఇక్కడే ఉండిపో!" అని నా సాయిబు మిత్రుడు చెప్పాడు. వద్దన్నాను.

ఏళ్ళు గడచినై. యుద్ధం వచ్చింది. నేను యుద్ధ సహకారం చేసినవాణ్నయినాను. రంగారావు అగస్టు హీరో అయినాడు. తదనంతరం నేను నిరుద్యోగినైనాను. రంగారావు లాభసాటి వ్యాపారస్థుడైనాడు.

నాకు రాజకీయాల్లో ఆసక్తి లేదంటే రంగారావు నమ్మడు. నాకు పెట్టుబడిదారీలో విశ్వాసం లేదనీ, రష్యా అంటే అభిమానం ఉందని రంగారావుకు తెలుసును. చాటుగా నేను కమ్యూనిస్టుననీ, కమ్యూనిస్టులు నన్ను మాయ మాటలతో బుట్టలో వేసుకున్నారనీ రంగారావు అనుమానం. నేను దరిద్రుల పక్షం మాట్లాడినా కూలివాళ్ళ పక్షం మాట్లాడినా, అతను సమ్మెలను

గురించి నిరసిస్తూ మాట్లాడితే నేను ఒప్పుకోకపోయినా రంగారావు అనుమానాలు బలపడుతూ ఉంటాయి. నా సంస్కారానికి ఒక రాజకీయ బురఖావేసి నా చేతిలో ఒక జండా పెడితే తప్ప రంగారావు అంతరాత్మకు శాంతి లేనట్టు కనబడ్డది. అప్పటికీ ఒకసారి స్పష్టంగా చెప్పేశాను:

"నువూ కావటానికి, స్వాతంత్ర్య ప్రియుడివేకాని, పెట్టుబడిదారీ విధానం సంఘానికి మంచిది కాదనీ రష్యాలో ఇంకేమీ లేకపోయినా అందరికీ చేసుకునే టందుకు పనీ, తినేటందుకు తిండీ, కట్టుగుడ్డా ఉందనీ అనుకునే స్వేచ్ఛ నా కుండరాదని నీ విశ్వాసం. నీ విశ్వాసానికి కారణమేమిటో నాకు తెలియటం లేదు. మాయ మాటలతో నన్ను కమ్యూనిస్టులు బుట్టలో వేశారంటున్నావు. నా స్నేహితుడివి కనక నా మంచి కోసం నువే ఎందుకు నన్ను నీ బుట్టలో వేసు కోవూ?" అని రంగారావు నడిగాను.

ఇట్లా అడిగే అధికారం కూడా నాకుండ రాదన్న మొహం పెట్టాడు రంగారావు.

అయితే రంగారావు రాజకీయ విశ్వాసాలు రంగారావుకు సంపూర్ణమైన మనశ్శాంతి నివ్వలేదు. అతనికి ఆంధ్రరాష్ట్రం గురించి గట్టి అభిప్రాయాలుంటూ వచ్చినై. ఆంధ్రరాష్ట్రం వచ్చితీరాలి. ఆంధ్రరాష్ట్రం కోసమైనా తెలంగాణాను నవాబునుంచి గుంజుకోవాలి. రాజకీయంగా, పాపం, మన కాంగ్రెసు వాళ్ళు నిజాము ప్రభువు సమస్య తేల్చలేని స్థితిలో ఉన్నారు.

"అయితే ఏంలే? 'నీ కాల్మొక్కుతా, నీ బాన్చని' అనే ముండాకొడుకులు ఎంత ధైర్యంగా పోట్లాడుతున్నారోయ్, స్వాతంత్ర్యం కోసం? నేను కల్లోకూడా అనుకోలేదు సుమా! నయమే, నిజాములో కమ్యూనిస్టులు కూడా మంచిపనే చేస్తున్నారు. వాళ్ళని మెచ్చుకోక తప్పదు." అన్నాడు రంగారావు నాదగ్గర.

ఇంతలో మళ్ళీ గాలి మళ్ళింది. ప్రజా ప్రభుత్వాలు "కమ్యూనిస్టు పీడ" అణచటానికి ఉపక్రమించాయి. కమ్యూనిస్టు పత్రికల మీద కేసులు పెట్టి పని జరగక ప్రభుత్వం పీటిని అణచసాగింది. సరిహద్దుమీద నిజాము ప్రభువు వారి దౌష్ట్యాన్ని ప్రతిఘటిస్తున్న చోట్ల కమ్యూనిస్టులు నిర్బంధంలోకి పంపబడ్డారు. తెలంగాణా వీర పోరాటాన్ని చిత్రించే "మా భూమి" నాటకం మీద ఆంక్ష విధించబడింది. నిజాము ప్రభువువారిని దారికి తెచ్చేటందుకు ఇవే మార్గాలని ప్రజా ప్రభుత్వం నిర్ణయిస్తే కాదనటానికి నే నెవణ్ని?

కాని నేను రంగారావుతో మాత్రం "ఏమోయ్, మన ఆంధ్ర రాష్ట్రం ఇంకా వెనక్కి పోతున్నట్టు కనిపిస్తుంది?" అన్నాను.

రంగారావు నామీద విరుచుకు పడ్డాడు. నాకి ప్రభుత్వం పోవాలని ఉందన్నాడు. నేను నానాటికీ మరీ చెడిపోతున్నానన్నాడు. నాతో మాట్లాడుతుంటే చూస్తేనే తనను ద్రోహి కింద పోలీసులు ఎరెస్టు చెయ్యవచ్చునన్నాడు. నాతో ఏది మాట్లాడినా ఫరవాలేదుగాని రాజకీయాలు మాట్లాడటం కంటె బుద్ధితక్కువ లేదన్నాడు.

"ధరలకి కంట్రోళ్ళుండాలంటే కమ్యూనిస్టు నన్నావు. ఉపాధ్యాయులకు జీతాలు పెంచాలన్నా కమ్యూనిస్టు నన్నావు. అయ్యో పాపం, గాంధీజీని హత్య చేశారంటే కమ్యూనిస్టు నన్నావు. ఆంధ్ర రాష్ట్రం కావాలన్నా కమ్యూనిస్టునే అంటావా?" అన్నాను.

రంగారావు నామీద తనకున్న కసియావత్తు తీర్చుకున్నాడు, కసి దేనికో నాకర్థం కాలేదు. అది నన్ను బాధించనూ లేదు. అతను మాట్లాడుతున్నంత సేపూ నాకు వినపడ్డ మాటలు :

"నీ కాళ్మొక్కుతా! నీ బాన్చని!"

[ప్రథమ ముద్రణ : మే 1948, అభ్యుదయ]